క్లుప్తంగా

రెవెన్యూ పార్కు అభివృద్ధికి వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ స్వాతి, అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో శిథిలావస్థకు చేరిన రెవెన్యూ పార్కును అభివృద్ధి చేయాలని విశాలాక్షినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మేయర్ గొలగాని హరివెంకటకుమారికి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని చాంబరులో వార్డు కార్పొరేటర్ స్వాతితో కలిసి వెళ్లి అసోసియేషన్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో సుమారు 5 వేల కుటుంబాలకు ఆహ్లాదం కలిగించే ఈ పార్కును ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్కును పరిశీలించిన అనంతరం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సత్తి నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.సింహాద్రిరావు, సభ్యులు దాడి సత్యనారాయణ, భీమారావు, లక్ష్మి, కళ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలి

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు సుందర్‌నగర్ శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు కోరారు. ఈ మేరకు వార్డులో గురువారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి హాజరైన ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణను స్థానికులతో కలసి పాత్రుడు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ శ్మశానవాటికలో మృతదేహాలను దహనం కోసం స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కొందరు మరణించిన వారికి గోళీలు నిర్మించడంతో స్థలం ఇరుకుగా మారుతుందని, గోళీలు నిర్మించకుండా శానిటరీ అధికారులను ఆదేశించాలని కోరారు.

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

బీచ్ రోడ్డు: ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని ప్రొఫెసర్ సాంబశివరావు అన్నారు. గురువారం కృష్ణా కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పని చేసే చోట మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు, సమాజంలో రావాల్సిన మార్పులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆర్.కుసుమకుమారి, కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన డోజో మోజో నాటకం



డోజో మోజో నాటక ప్రదర్శన

బీచ్ రోడ్డు: రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలలో భాగంగా పిఠాపురం కాలనీ కళాభారతిలో గురువారం ప్రదర్శించిన డోజో మోజో నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న మనస్తత్వాలు కలిగిన ముగ్గురు వ్యక్తుల కలలను కథా అంశంగా డోజో మోజో నాటిక సాగింది. ఎవరికి వారు తమ కలల్ని నిజం చేసుకోవడానికి ఇతరుల ప్రమేయం అవసరం లేదని అనుకునే ఈ ముగ్గురు వారికి తెలియకుండానే ఒకరికొకరు సహకారం చేసుకొని వారి కలల్ని నిజం చేసుకుంటారు. ఈ కథను ఎంతో రసవత్తరంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కథను మల్లేశ్వరరావు ఆకుల అనువాదం చేశారు.

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు	పాఠశాలలో ఉన్న ఐఎఫ్‌పీ ప్యానళ్లు	డిజిటల్ క్లాస్ రూమ్	ఇంటర్నెట్
162	19	1	ఏపీ ఫైబర్ నెట్

సర్కారు బడిలో డిజిటల్ పాఠాలు

- విద్యార్థులకు అందుబాటులో టాబ్‌లు
- ఐఎఫ్‌పీ ప్యానల్స్‌పై బోధన
- ఇంటర్నెట్‌తో అనుసంధానం
- కేడీపీఎం పాఠశాలలో ఆకట్టుకుంటున్న సాంకేతికత విద్య

బోధనలో నూతన అధ్యాయానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డిజిటల్ యుగంలో విద్యార్థులకు బోధనా పద్ధతుల్లో వినూత్న మార్పుల దిశగా ముందడుగు వేసింది. నవ శకానికి నాంది ప్రస్తావన చేయడం ద్వారా మిగిలిన ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచింది. విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించిన ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేర్పాటు చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌పై పాఠ్యాంశ బోధన వింటున్న విద్యార్థులు



పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు



కేడీపీఎం పాఠశాల



ఏయూ క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక వసతులు సమకూరాయి. కలలో కూడా ఊహించని డిజిటల్ బోధన వారికి చేరువైంది. దేశ అభ్యున్నతికి విలువైన మానవ వనరులుగా నిలిచే నేటి తరం చిన్నారులను మలిచే పాఠశాలకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారు. దీనిలో భాగంగా నాడు–నేడు కింద పాఠశాలల స్వరూపాన్ని మార్చేసిన ప్రభుత్వం.. మరో అడుగు ముందుకు వేసింది. విద్యార్థులకు డిజిటల్ బోధనలో ఆసక్తిదాయకంగా, మెరుగైన అవగాహన కల్పించే దిశగా పని చేస్తోంది. జీవీఎంసీ 20వ వార్డు కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్ల(ఐఎఫ్‌పీ)పై అధ్యాపకులు బోధిస్తూ విద్యార్థులకు పఠనాసక్తిని పెంచుతున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 19 ఐఎఫ్‌పీలు ప్రభుత్వం సమకూర్చింది. 162 మంది విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు సైతం అందించింది. ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీల సహాయంతో నిత్యం అధ్యాపకులు ఆసక్తిదాయకంగా, విద్యార్థులకు బోధన జరుపుతున్నారు.

ఐఎఫ్‌పీలతో బహుళ ప్రయోజనాలు

ప్రస్తుతం పాఠశాలలో అందుబాటులో ఉన్న ఐఎఫ్‌పీలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న బైజూస్ కంటెంట్ ఐఎఫ్‌పీలలో వీక్షించే అవకాశం ఉంది. దీని వల్ల అధ్యాపకులు పాఠ్యాంశాలను వివరించడానికి, విద్యార్థులకు సులభంగా అర్థం కావడానికి అవకాశం ఏర్పడింది. అదే విధంగా పాఠశాలకు ఏపీ ఫైబర్ నెట్ సహాయంతో ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. ఐఎఫ్‌పీలకు ఇంటర్నెట్‌ను అనుసంధానం చేస్తూ ప్రతీ అంశాన్ని అధ్యాపకులు ఎంతో ఆసక్తిదాయకంగా, దృశ్య శ్రవణ మాధ్యమాన్ని వినియోగిస్తూ బోధన జరుపుతున్నారు. అధ్యాపకులు చెప్పిన అంశాలను ఫైల్స్ రూపంలో భద్రపరుచుకుని, ఎప్పుడు అవసరమైతే అప్పుడు పొందే అవకాశం ఉంది.

ఆసక్తిదాయకంగా బోధన



విద్యార్థులు చూస్తూ.. చేస్తూ నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. దీనిలో భాగంగా తరగతి గదిలో ప్రతి పాఠ్యాంశాన్ని ప్రత్యక్షంగా పలు ఉదాహరణలతో వివరిస్తూ బోధన చేయడానికి డిజిటల్ బోధన ఉపకరణాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. విద్యార్థిని తరగతి గదిలో యాక్టీవ్‌గా ఉంచుతూ బోధన ఆసక్తిదాయకంగా జరుపుతున్నాం.

– వి.లోవకుమారి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు

గణిత బోధనకు ఉపయుక్తం



సంక్లిష్టమైన అంశాలను సులభరీతితో విద్యార్థికి అర్థమయ్యేలా చెప్పడానికి డిజిటల్ బోధన ప్రభావవంతమైన మాధ్యమంగా నిలుస్తోంది. గణితంలో కొన్ని సూత్రాలు, సిద్ధాంతాలు ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించడానికి ఇవి దోహదపడుతున్నాయి. గణిత బోధనకు ఇవి ఎంతో ఉపకరిస్తున్నాయి.

– ఎ.హైమ, గణిత ఉపాధ్యాయిని

పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి..



తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. నోట్సు ఐఎఫ్‌పీలో సేవ్ చేసుకుని తిరిగి అవసరమైనప్పుడు చూసుకునే అవకాశం ఉంది. అదే విధంగా ప్రతి పాఠ్యాంశానికి పలు ఉదాహరణలు ఇస్తున్నారు. వీడియోలు చూపుతూ లోతైన అవగాహన కల్పిస్తున్నారు. డిజిటల్ బోధన మాకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది.

– ఎ.అన్నపూర్ణ, 9వ తరగతి, కేడీపీఎం పాఠశాల

రేపటి నుంచి లలితా పీఠంలో ధనుర్మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మన్నవ కృష్ణసేన్

సీతంపేట: లలితానగర్‌లో లలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రతి రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన, శాతుపాశురాల విన్నపం, గోదా చతుశ్లోకి జరుగుతాయని తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 3న సహస్ర దీపాలంకరణ, 11న కూడారై ఉత్సవం, 14వ తేదీ భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బీచ్ రోడ్డు: ఏపీ ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని డీఈ సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకోజీపాలెం, మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, జేఆర్ నగర్, భానునగర్, ఇసుకతోట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



చేదూరి రాంబాబు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరలిలా.. జ్ఞానాపురం రాసవీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న చేదూరి రాంబాబు తాపీమేస్త్రిగా పనిచేస్తుంటాడు. ఈ నెల 10న వ్యక్తిగత పనిమీద కాకినాడకు వెళ్లాడు. తిరిగి బంధువులు 11న ఉదయం విశాఖకు వచ్చేందుకు రాంబాబును బస్ స్టాండ్‌కు సమీపంలో దింపేశారు. అనంతరం అతడు ఇంటికి వచ్చేస్తాడని బంధువులు ఫోన్ ద్వారా రాంబాబు భార్యకు తెలిపారు. రాత్రి అయినా రాకపోవడంతో అంతటా ఆరా తీశారు. తర్వాత ఫోన్ కూడా పనిచేయలేదు. దీంతో అతని భార్య చేదూరి విజయలక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఐదు అడుగుల 9 అంగుళాల ఎత్తు, చామనఛాయ రంగులో ఉంటాడు. ఎవరికైనా కనిపిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

విస్తృతంగా పారిశుధ్యం పనులు



శుభ్రం చేసిన తరువాత

ఏయూ క్యాంపస్: నగర పరిశుభ్రతకు పారిశుధ్యం కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారు. చేతులతో చీపురుపట్టి శుభ్రం చేస్తున్నారు. స్థానిక 20వ వార్డు పరిధిలో పోలమాంబ ఆలయానికి ఆనుకుని ఉన్న ఏయూ స్థలంలో పక్కనే ఉన్న స్థానికులు వ్యర్థాలు పారవేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అంతా వ్యర్థాలతో నిండిపోయింది. గురువారం మధ్యాహ్నం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించి, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

శాస్త్రోక్తంగా పగల్‌పత్తు ఉత్సవాలు



పారాయణాలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలు రెండో రోజు గురువారం శాస్త్రోక్తంగా కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి ఉదయం ఆలయ బేడా మండపంలో అయ్యవారి సేవను విశేషంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేశారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అథ్లెటిక్స్‌లో బుల్లయ్య కళాశాలకు పతకాలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు. మహిళా అథ్లెట్లు 800, 1500, 5000 మీటర్లు, రిలే, 21 కిలో మీటర్ల మారథాన్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ ఆఫ్ రన్నర్ అప్‌గా నిలిచారు. పురుషుల జట్టు జావెలిన్, డెకథ్లాన్, రిలే, లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు పొందారు. ఈ సందర్భంగా గురువారం విజేతలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజులుగా న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో రాత్రి వేళ పాదాచారులు, వాహన చోదకులను చాకులతో బెదిరించి వారి వద్ద నుంచి నగదు వసూళ్లు చేస్తున్నారని సమాచారంతో పోలీసులు నలుగురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కులం, కట్నం పేరుతో వేధింపులు

మద్రిపాలెం: తన భర్త, అతడి కుటుంబ సభ్యులు క లిసి కులం పేరుతో దూషిస్తున్నారని ఓ వివాహిత కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాలిలా.. తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్న బంగారమ్మ ఆమె భర్త భానుచంద్ర కొన్నేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలం వరకు బాగానే ఉన్నారు. ఇటీవల కాలంలో వారిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. కులం పేరుతో భర్త, అతడి కుటుంబ సభ్యులు తరచూ దూషించడం, కట్నం కోసం వేధించడం చేస్తున్నారు. ఈ వేధింపులు తట్టుకోలేక ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- తూర్పులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర
- 13వ వార్డులో నేడు శ్రీకారం
- 60 రోజుల పాటు కొనసాగించనున్నట్లు ఎంపీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు 60 రోజుల పాటు తూర్పు నియోజకవర్గం పరిధిలో యాత్ర చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. ఆయా వివరాలను గురువారం లాసన్స్‌బే కాలనీలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు, కష్టాలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారం దిశగా తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూనే ప్రజా సమస్యల పరిష్కారానికి పాదయాత్ర ద్వారా కృషి చేస్తానని ఎంవీవీ చెప్పారు. నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రతి వార్డులోను 4 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, తదితర సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతామన్నారు. సామాజిక భవనాలు, ఆలయాలు, తదితర అభివృద్ధి అంశాలపై ఆయా వార్డుల వారీగా వినతుల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ ల్యాండ్స్‌తో పాటు సొంత నిధులను వాటి నిర్మాణానికి కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి ఔత్సాహిక క్రీడాకారుడు భాగస్వామి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

ఉన్నత లక్ష్యాలకు బాటలు వేసుకోండి



ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన ఈ వేడుకల్లో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా వర్సిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీని ఆధారంగా చేసుకుని తమ ఉన్నత భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలని సూచించారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార జి.వీర్రాజు, ఆచార్య పి.ప్రేమానందం, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాల అమలు



10వ వార్డులో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పదో వార్డు సుందర్‌నగర్ పార్కులో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ స్థానిక నాయకులతో కలసి పార్టీ జెండా, సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ రావాల్సిన అవసరం ఉందన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోలో 98 శాతం అమలు చేశామన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

'ఫిష్ ఆంధ్రా' ఏర్పాటుకు స్థల పరిశీలన



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఫిషరీస్ జేడీ లాల్ మహ్మద్‌కు వినతి

ఆరిలోవ: తోటగరువు ప్రాంతంలో ఫిష్ ఆంధ్రా షాపుల ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్ పరిశీలించారు. అనంతరం మత్స్యకార మహిళలతో మాట్లాడి ఇక్కడ ఫిష్ ఆంధ్రా పేరుతో నిర్మించనున్న 29 షాపుల కోసం పూర్తి వివరాలుతో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎర్ని దుర్గామాంబ మత్స్యకార మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలు ఫిషరీస్ జేడీకి వినతి పత్రం అందజేశారు. ఫిష్ ఆంధ్రా షాపులను త్వరగా నిర్మించి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ విశాఖ నగర మత్స్యకార సంఘం అధ్యక్షుడు కె.రాజవర్మ, సభ్యులు వెంకటేశ్వరరావు, అచ్చుతరావు, అప్పన్న, అప్పలరాజు, ఝాన్సీ, లీలావతి పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో గురువారం స్టాళ్లకు డ్రా తీశారు. వాటి టోకెన్లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 66 మంది రైతులకు సంబంధించి స్టాళ్లకు డ్రా తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సృజనాత్మకత



క్విజ్ పోటీల విజేతలతో అతిథులు

విశాఖ సిటీ: పుస్తక పఠనంతో పిల్లల్లో విజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతాయని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. టర్నర్‌చౌల్ట్రీలో జరుగుతున్న విశాలాంధ్ర బుక్ హౌస్ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వీ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ద్వారకానగర్ రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సీనియర్ విభాగంలో రవీంద్ర భారతి స్కూల్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, మధురానగర్ జీవీఎంసీ హై స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఈవో లక్ష్మీప్రసన్న బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, వీ డెంటల్ హాస్పిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డ్, డెంటల్ కిట్లు అందజేశారు. క్విజ్ మాస్టర్లుగా ప్రసన్న కుమార్, నవ్య సిరికి, కె.పృథ్వీరాజ్ వ్యవహరించారు. వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.